మిర్చి సాగుపై అనాసక్తి

- గత ఏడాది తీవ్ర నష్టాలు
- పెరిగిన పెట్టుబడులు, కూలీ రేట్లు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

సంజామల: మిర్చి సాగుపై అన్నదాతలు అనాసక్తి చూపుతున్నారు. గత రెండేళ్ల తీవ్ర నష్టాలను చవి చూడడంతో ఆ పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడి ఖర్చులు పెరగడం, ఎరువుల కొరత, ధరలు, కూలీ రెట్టింపు కావడం, ఖరీదైన పురుగు మందులు తప్పనిసరిగా వాడాల్సి రావడం , పంటకు తెగుళ్ల ఇవన్నీ రైతుల పరిస్థితిని మరింత దారుణంగా మార్చాయి. అంతేకాకుండా గత ఏడాది పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఎకరాకు లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. రైతులే దేశానికి వెన్నముక అన్న ప్రభుత్వాలు రైతు అప్పుల భాధతో ఆత్మహత్యలు చేసుకుంటుంటే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలో మిర్చి సాగు ఇలా..

జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గంలో గత ఏడాది 9,198 ఎకరాల్లో అత్యధికంగా మిర్చి సాగు చేశారు. సంజామల మండలంలో 4,200, కోవెలకుంట్లలో 2,605, బనగానపల్లెలో 1,733, అవుకు మండలంలో 430, కొలిమిగుండ్ల మండలంలో 230 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు నియోజకవర్గం మొత్తం 2–3 వేల ఎకరాల్లో కూడా మిర్చి పంటను సాగు చేయని పరిస్థితి నెలకొంది. రైతులు ఏ పంట వేసినా నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం, పెట్టుబడి సాయం చేయకపోవడం, గిట్టుబాటు ధర కల్పించి భరోసా కల్పించకపోవడం వెరసి రైతులు నష్టాల బాట పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుకు మద్దతు ధరతో పాటు పంట నష్ట పరిహారం అందించి ఆదుకుంది. గతంలో మిర్చి క్వింటా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. అయితే గత రెండు సంవత్సరాల నుంచి క్వింటా రూ.8 వేల నుంచి రూ.13 వేలకు పడిపోయింది. మిర్చి రైతులకు ఎన్నడూ లేని నష్టాలు ఈ రెండేళ్ల నుంచి వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంట నష్ట పరిహారం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మిరప పంట

తప్పని నష్టాలు

మిర్చి పంటకు మొదటి నుంచి ఖరీదైన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ. లక్షలు పెట్టుబడి పెడితే కానీ రైతులకు అనుకున్నంత పంట రాదు. గత ఏడాది మిర్చి రైతుకు బ్లాక్ ఇయర్ అని చెప్పవచ్చు. పంట ఎక్కువగా సాగు చేసినా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పలేదు. దీంతో ఈ ఏడాది మిర్చి పంటపై రైతుకు ఆసక్తి తగ్గి ఇతర ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, మినుము పంటపై ఆసక్తి చూపుతున్నారు.

గిట్టుబాటు ధరలేక నష్టపోయాం



ఏటా సుమారు 9 ఎకరాల్లో మిరప పంట సాగు చేసేవాళ్లం. కానీ గత ఏడాది వచ్చిన భారీ నష్టాలకు కుదేలయ్యాం. ఈ ఏడాది కేవలం మూడు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాం. కేజీ మిరప రూ.150కి పడిపోవడంతో ఎకరానికి రూ.50 వేల వరకు నష్టం వస్తోంది. ప్రభుత్వానికి రైతులపై నిజమైన ప్రేమ ఉంటే గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.
–ధర్మారెడ్డి, మిర్చి రైతు, ఆకుమల్ల

10 ఎకరాల్లో పంట సాగు చేశా



గతేడాది 15 ఎకరాల్లో మిరప సాగు చేశా. గిట్టుబాటు ధర లేక నష్టపోయా. అంతేకాకుండా రైతులకు ఎలాంటి భరోసా పథకాలు కూడా రాలేదు. ఈసారి 10 ఎకరాల్లో మాత్రమే సాగు చేశా. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకుంటుందన్న నమ్మకం లేదు. ఈ ఏడాది లాభం వస్తుందో లేదో వేచి చూడాలి.
–గౌరిగారి నాగేశ్వర్‌రెడ్డి, మిర్చి రైతు, ఆకుమల్ల

క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసభ్యులు, పంచాయితీ కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. బీపీ, షుగర్, గుండెజబ్బులు, ఊపిరితిత్తులు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే ఉచితంగా మందులు అందిస్తామన్నారు. సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల తదితర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరామర్శ


మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరుకు చెందిన సహకార సంఘం మాజీ చైర్మన్ పసుల్ల నాగిరెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు హరినాథ్‌రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం


ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

బేతంచెర్ల: పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నగర పంచాయతీ సిబ్బంది శుభ్రపరిచే పనులు చేపట్టి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సువర్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ నివారణకు టీకాలు తప్పనిసరి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ

సంజామల: సంజామలలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ.. వీధి కుక్కలతో పాటు ఇంట్లో పెంచుకునే శునకాలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో పెంపుడు కుక్కలకు సంవత్సరానికి రెండు సార్లు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కుక్కల నుంచి వ్యాపించే ఈ వ్యాధి మనుషులకు సోకితే మందులేదని హెచ్చరించారు. ఆదివారం ప్రతి గ్రామంలో కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలని పిలుపునిచ్చారు.

కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు

కొలిమిగుండ్ల: విద్యాసంస్థలకు దసరా సెలవులు ఇవ్వడంతో పాటు పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కావడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో అధిక భాగం మహిళలే ప్రయాణిస్తున్నారు. వీటికి తోడు సెలవులు, శుభకార్యాలు రావడంతో రద్దీ మరింత పెరిగింది. అదనపు సర్వీసులు ఏర్పాటు చేయకుండా ఉన్న సర్వీసులనే అధికారులు నడుపుతున్నారు. కొలిమిగుండ్ల మీదుగా వెళ్లే ఏబస్సు చూసినా కిటకిటలాడుతున్నాయి. ఏబస్టాప్‌లో చూసినా ప్రయాణికులు పదుల సంఖ్యలో కనిపిస్తున్నారు. బస్సుల్లో సాధారణ సంఖ్య కంటే అధికంగా ప్రయాణికులు ఎక్కడంతో కండక్టర్లు సైతం టికెట్లు ఇచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

వీడని వాన.. ఆందోళనలో రైతన్న


పొలంలో చేరిన వర్షపునీరు


కోవెలకుంట్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కోవెలకుంట్ల: అల్పపీడనం ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు సబ్‌డివిజన్‌లోని ఆయా మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 32మి.మీ, అవుకులో 11 మి.మీ, సంజామలలో 8.02మి.మీ, కొలిమిగుండ్లలో 1.2 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న పత్తి, మిరప, జొన్న తదితర పంటల్లో వర్షపునీరు నిల్వ చేరింది. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజనలో చివరి పంటగా జొన్నసాగుకు వర్షాలు ఆటంకంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నిండిన రామభద్రుని చెరువు

సంజామలలో 8.02 మి.మీ వర్షపాతం

సంజామల: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 8.02 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ముక్కమల్ల చెరువు, రామభద్రుడు చెరువు, ఆకుమల్ల గ్రామంలో ఉన్న పెద్దకుంట నీటితో కళకళలాడుతున్నాయి.

మొక్కజొన్న పంటకు నష్టం

బనగానపల్లె: మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఖరీఫ్‌లో ముందస్తుగా వేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా ఇతర పంటల కంటే మొక్కజొన్న పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర ఇచ్చినందున ఈ ఏడాది రైతులు పెద్ద ఎత్తున ఈ పంట సాగు చేశారు. మండలంలో సుమారు 4 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు జరగగా, ఎక్కువ విస్తీర్ణంలో ముందుగా వేసిన పంట ఇప్పుడు కంకి దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంట నూర్పిడికి సిద్ధమవుతోంది. అయితే కంకి దశలో ఉన్న పంటకు చీడపీడలు ఆశించి గింజలను తినేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అలాగే నూర్పిడికి సిద్ధమైన పంటలో భూమిలో తేమ అధికంగా ఉండడంతో కోత పనులకు వీలు పడడం లేదని రైతులు వాపోతున్నారు.


మొక్కజొన్నలో ఆశించిన చీడపీడలు

టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం

- సర్పంచ్‌కు తెలియకుండానే చెరువులోకి చేపలు

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్న ధీమాతో తాము ఏం చేసినా చెల్లుతుందన్న భావనలో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కలచట్ల గ్రామంలోని ఊరి చెరువు నిండింది. దీంతో కలచట్ల పంచాయతీకి చెందిన ఓ టీడీపీ నాయకుడు తన అనుచరుల ద్వారా శనివారం చెరువులోకి దాదాపు 80 వేల చేప పిల్లలను వదిలాడు. సాధారణంగా చెరువులో చేపల పెంపకానికి సంబంధించిన సమాచారం గ్రామ పంచాయతీ వారు దండోరా ద్వారా గ్రామస్తులకు తెలియజేసి వేలం నిర్వహించాలి. సర్పంచ్‌కు, అధికారులకు కూడా తెలియకుండా టీడీపీ నాయకుడు చెరువులోకి చేప పిల్లలను వదలడం చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత మహిళ కావడం వల్లే టీడీపీ నాయకుడు ఇలా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సర్పంచ్ రమాదేవిని వివరణ కోరగా చేపలు వదిలే విషయమై తనకు సమాచారం లేదన్నారు.

భగత్ సింగ్‌కు నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, విద్యార్థి నాయకులు

బేతంచెర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యాలయలంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దుకాణాల్లో మోసాలపై ఫిర్యాదు


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నేతలు

డోన్ టౌన్: పట్టణంలోని సూపర్ మార్కెట్లు, కిరాణా షాపుల్లో జీఎస్టీ పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మారం రంగనాయకులు ఆరోపించారు. శనివారం స్థానిక తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో అధికారి నాగరాజుకు ఫిర్యాదు చేశారు. సూపర్ మార్కెట్లలో ధరల వ్యత్యాసం, తూకాల్లో మోసాలు, కాలం చెల్లిన వస్తువుల విక్రయం తదితర విషయాలను పేర్కొన్నారు. స్పెషల్ ఆఫర్ల పేరుతో కాలం చెల్లిన వస్తువులను ప్రజలకు అంటగడుతున్నారని ఆరోపించారు. అధికారులు తరచూ దాడులు చేయాలని, ప్రజలకు నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు అందించేలా చూడాలని కోరారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు దొరపల్లె రాజు, మునీంద్ర, మున్నా, ఓబులేసు తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి బుగ్గన జన్మదిన వేడుకలు


బేతంచెర్ల: బుగ్గన జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు


బేతంచెర్ల కొత్త బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

బేతంచెర్ల/ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆయన తనయుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బేతంచెర్ల పార్టీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, నాయకులు మూర్తుజావలి, ఖాజా పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కొత్త బస్టాండ్‌లోని రామనాథ్ రెడ్డి కాంప్లెక్స్‌లో బాబుల్‌రెడ్డి, బుగ్గన కుమార్‌రెడ్డి, సూర్య బళ్లాని కేక్ కట్ చేశారు. నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, వైస్ ఎంపీపీ రంగస్వామి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, గూని నాగరాజు, బలరాముడు, ధరణి, భాస్కర్‌రెడ్డి, చలపతిరెడ్డి పాల్గొన్నారు. ప్యాపిలి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు మెట్టు విఘ్నేశ్వర్ రెడ్డి, కమతం పుల్లారెడ్డి, పాండు, ప్రకాశ్, జాకీర్, రమణ, మహిధర్ రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి బుగ్గన సేవలను కొనియాడారు.


కాత్యాయనీదేవిగా చౌడేశ్వరిదేవి


బనగానపల్లె: గజలక్ష్మీగా వాసవీమాత


కోవెలకుంట్ల: నాగాక్షిదేవిగా వాసవీమాత


డోన్: అమ్మవారిశాలలో సౌందర్యలక్ష్మీనారాయణ


బేతంచెర్ల: మయూర వాహనంపై లలితా త్రిపురసుందరిదేవి

కరుణించు.. కాత్యాయనీ


ఆర్‌ఎస్ రంగాపురంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులకు కిటకిటలాడుతున్నాయి. శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కుంకుమార్చన, చండీ పారాయణం, దేవీ పారాయణం తదితర పూజలు జరిగాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నందవరం చౌడేశ్వరిదేవి కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. బేతంచెర్ల మద్దిలేటి ఆలయలోని మహాలక్ష్మి అమ్మవారు లలితా త్రిపురసుందరిగా పూజలందుకున్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవలో సింహ వాహనంపై, అనంతరం మయూర వాహనంపై శోభాయమానంగా దర్శనం ఇచ్చారు.
–సాక్షి నెట్‌వర్క్



సంజామలలో..అవుకులో బాలాత్రిపురసుందరిదేవి


డోన్: పాతబస్టాండ్‌లో లలితా త్రిపురసుందరిగా..


బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో సింహవాహనంపై మహాలక్ష్మి

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం



బనగానపల్లె: బనగానపల్లె–కోవెలకుంట్ల రహదారిలోని అవుకు మెట్ట సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. గుంతల కారణంగా వర్షం పడినప్పుడు నీరు నిలిచి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ రహదారి ద్వారా బనగానపల్లె నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, తిరుపతి వైపునకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు దుస్థితికి చేరడంతో వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

అవుకు(కొలిమిగుండ్ల): ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను అవుకు మండలంలో పంపిణీ ప్రారంభించినట్లు తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలో 41 చౌకదుకాణాలు ఉండగా 15,727 స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. కార్డుదారులందరికీ గ్రామాల వారిగా ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

టెర్రస్ గార్డెనింగ్‌లో డోన్ మహిళకు రాష్ట్రస్థాయి అవార్డు


అవార్డుతో వాణిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): టెర్రస్ గార్డెనింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్న డోన్‌కు చెందిన చిన్నపరెడ్డిగారి వాణిరెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఏరువాక ఫౌండేషన్ అనే సంస్థ 2024 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రదానం చేసింది. మిద్దె తోటలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది మంది మహిళలు అవార్డులకు ఎంపికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వాణిరెడ్డికి అవార్డు లభించింది. ఆమె తన భర్త వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో కొన్నేళ్లుగా మిద్దెతోటలో అద్భుతంగా రాణిస్తున్నారు. టెర్రస్ గార్డెన్‌లో కిచెన్ వ్యర్థాలతో కంపోస్టు ఎరువులు ఉత్పత్తి చేసుకొని వినియోగిస్తారు. చీడపీడలు కనిపిస్తే మజ్జిగలో ఇంగువ కలిపి పిచికారి చేసుకుంటారు.